DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
ఆదివారం, నవంబరు 19, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## కార్పొరేటర్‌ని చంపేస్తామని బెదిరించారు: తుమ్మల



ఖమ్మం: కాంగ్రెస్ లో చేరిన కార్పొరేటర్ ని అధికార బీఆర్ఎస్ నేతలు చంపేస్తామని బెదిరించారని మాజీ మంత్రి, కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వర రావు సంచలన ఆరోపణలు చేశారు. ఖమ్మంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న తుమ్మల.. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. "అధికార అహంకారంతో బీఆర్ఎస్ నేతలు ఆర్య వైశ్యులను బెదిరిస్తున్నారు. నలభై ఏళ్ల రాజకీయ జీవితం లో ఆర్య వైశ్యులు నాకు మద్దతు గా నిలిచారు. వారి ఆత్మ గౌరవం గురించి తెలియని వారు విర్రవీగుతున్నారు. కాంగ్రెస్ లో చేరిన ఓ కార్పొరేటర్ ను చంపేస్తామని బెదిరించారు. ఖమ్మం చరిత్రలో ఏనాడైనా ఇలాంటి అరాచకం చూశామా? నగర అభివృద్ధి పై చర్చకు వచ్చే దమ్ముందా? గోళ్ళపాడు ఛానల్ కాంట్రాక్టర్ ను బెదిరించి రూ.70 కోట్ల పని రూ.170 కోట్ల కు పెంచి దోచుకున్నారు.



## విశ్వ సుందరిగా నికరాగ్వా భామ షెన్నిస్ పలాసియోస్

ప్రతిష్ఠాత్మక 'మిస్ యూనివర్స్' కిరీటం ఈ ఏడాది నికరాగ్వా భామ సొంతమైంది. షెన్నిస్ పలాసియోస్ 'మిస్ యూనివర్స్ -2023' టైటిల్ దక్కించుకున్నారు. మాజీ విశ్వ సుందరి ఆర్ బానీ గాబ్రియేల్ ఈ కిరీటాన్ని ఆమెకు అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక, ఈ పోటీల్లో థాయ్‌లాండ్‌కు చెందిన ఆంటోనియా పోర్సిల్డ్ మొదటి రన్నరప్‌గా కాగా ఆస్ట్రేలియాకు చెందిన మోరయా విల్సన్ రెండో రన్నరప్‌గా నిలిచారు. దీంతో, వీరికి నెటిజన్లు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు చెబుతున్నారు. విశ్వ సుందరి కిరీటాన్ని సొంతం చేసుకున్న తొలి నికరాగ్వా భామ షెన్నిస్ పలాసియోస్ కావడం విశేషం. చివరి రౌండ్‌లో ఆమె చెప్పిన సమాధానానికి అందరూ ఫిదా అయ్యారు. 'ఒక ఏడాది పాటు వేరే మహిళగా జీవించాలనుకుంటే ఎవరిలా ఉండాలనుకుంటారు? ఎందుకు?' అని ప్రశ్నించగా స్త్రీ హక్కుల కోసం ఎంతగానో పోరాటం చేసిన సామాజిక వేత్త మేరీ వాట్సన్ బ్రాడ్‌ను ఎంచుకుంటా. ఎందుకంటే, సమాజంలో ఉన్న వ్యత్యాసాలను తొలగించి ఎంతోమంది మహిళలకు అవకాశాన్ని కల్పించారు. స్త్రీలు అనుకుంటే ఎక్కడైనా వర్క్ చేయగలరు. కాబట్టి, తాము కోరుకున్న రంగంలో మహిళలు పని చేసేందుకు సరైన పరిస్థితులు తీసుకురావడానికి నేను కృషి చేయాలనుకుంటున్నానని ఆమె బదులిచ్చారు. శాన్ సాల్వడార్ వేదికగా జరిగిన ఈ పోటీల్లో 84 దేశాలకు చెందిన అందాల భామలు పోటీ పడ్డారు. మన దేశం తరపున ఈ పోటీల్లో పాల్గొన్న శ్వేతా శార్దా టాప్ 20లో నిలిచారు. విశ్వసుందరి పోటీల్లో తొలిసారి పాకిస్థాన్ తరపున ఎరికా రాబిన్ పోటీపడ్డారు.

## యాదాద్రి కంటే గొప్పగా భద్రాద్రిని అభివృద్ధి చేస్తాం: కేటీఆర్



ఇల్లెందు: చిన్న చిన్న అసంతృప్తులను పక్కనపెట్టి భారాస అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాచలం, ఇల్లెందులో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో 11 సార్లు గెలిచిన కాంగ్రెస్ 24 గంటల కరెంట్ ఇచ్చిందా? అని ప్రశ్నించారు. భారాస అధికారంలోకి వచ్చిన తొలి విడతలోనే 24 గంటల విద్యుత్ ఇచ్చామన్నారు. తెలంగాణలో మరోసారి రాబోయేది భారాస ప్రభుత్వమేనని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. భద్రాచలం వచ్చినప్పుడు రాముడి పాదాలకు నమస్కరించాలనుకున్నానని, అయితే అధికారుల విజ్ఞప్తి మేరకు వెళ్లలేదని చెప్పారు. తొందర్లోనే మళ్లీ వచ్చి రామయ్య దర్శనం చేసుకుంటానని అన్నారు. కారణాలు ఏమైనప్పటికీ భద్రాచలంలో ప్రజలు మాకు అవకాశం ఇవ్వలేదు. కానీ, ఈసారి మాత్రం కచ్చితంగా గులాబీ వనంలోకి భద్రాచలం చేరాలి. కారు గుర్తు అభ్యర్థి గెలవాలి. గత రెండు పర్యాయాలు భారాస ఎమ్మెల్యే అభ్యర్థి గెలవలేదు. దానివల్ల కొంత గ్యాప్ వచ్చింది, ఈసారి పార్టీ అభ్యర్థి తెల్లం వెంకట్రావును గెలిపించండి, వరదల ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపిస్తాం. యాదాద్రి కంటే గొప్పగా భద్రాచలం రామాలయాన్ని అభివృద్ధి చేస్తాం. ఒక్క ఛాన్స్ ఇవ్వాలని కాంగ్రెస్ అడుగుతోంది. ఇప్పటివరకు 11 ఛాన్స్‌లు ఇచ్చారు. కొంతమంది డబ్బు సంచులతో వస్తున్నారు. అలాంటి వాళ్ల మాటలు నమ్మొద్దని కేటీఆర్ కోరారు.

## వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తాం

### తెలంగాణ సీఎం కేసీఆర్



అలంపూర్ (వాయిస్ టుడే): ప్రజాస్వామ్యంలో ఫ్యాక్షనిస్టులు, గూండాలు గెలవకూడదని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. ప్రజల చేతిలో ఉన్న ఏకైక వజ్రాయుధం ఓటు అని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో నిర్వహించిన భారాస ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ మాట్లాడారు. "గతంలో పాలమూరు నుంచి అధికంగా వలసలు ఉండేవి. ప్రస్తుతం అక్కడ వచ్చిన పరిస్థితులను ప్రజలు గుర్తించాలి. ఆర్డీఎస్ నుంచి నీళ్లు తరలించుకుని వెళ్తున్నా అప్పుడు ఎవరూ మాట్లాడలేదు. కాంగ్రెస్ నేతలు పదవుల మీద ఆశతో ఏం మాట్లాడలేదు. వాల్మీకి బోయలను బీసీల్లో కలిపింది కాంగ్రెస్ పార్టీయే. మరోసారి భారాస అధికారంలోకి వస్తే వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరుస్తాం. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందన్నారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని ఆ పార్టీ నేతలు అంటున్నారు. అప్పుడు ఆకలి బతుకులు తప్ప ఇంకేం లేవు. కాంగ్రెస్ నేతలు చేసిన అన్యాయాలను సరిదిద్దుకొస్తున్నాం. ఆర్డీఎస్ కాలువల్లో పూడికతీత పనులకు రూ.13కోట్లు మంజూరు చేశాం. పాలమూరులో కరవు రాకుండా చూసే బాధ్యత నాది. కాంగ్రెస్ హయాంలో ఉండే పింఛన్‌ను రూ.2వేలు చేశాం. మరోసారి అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ.5వేలకు పెంచుతాం. రైతుబంధు వృథా అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారు. 24 గంటల కరెంట్ వృథా.. 3 గంటలు చాలు అని రేవంత్ అంటున్నారు. ప్రజలు విచక్షణతో ఆలోచించి ఓటేయాలని కేసీఆర్ అన్నారు.

**ఇందిరమ్మ రాజ్యంలో ఆకలి బతుకులే :** బీఆర్ఎస్ వచ్చాక పాలమూరులో మారిన పరిస్థితుల్ని ప్రజలు గమనించాలని ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. అలంపూర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో గూండాలు, ఫ్యాక్షనిస్టులు, రౌడీలు గెలవకూడదన్నారు. ప్రజల చేతిలో ఉన్న ఏకైక ఆయుధం ఓటు అన్నారు. ఇదివరకు పాలమూరు నుంచి అధికంగా వలసలు ఉండేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఆర్డీఎస్ నుంచి నీళ్లు తరలించుకుపోతున్నా అప్పుడు ఎవరూ మాట్లాడేవారు కాదన్నారు. పదవుల మీద ఆశతో కాంగ్రెస్ నాయకులు అప్పుడు మాట్లాడలేదన్నారు. వాల్మీకి బోయలను బీసీలలో కలిపింది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. తాము మళ్లీ అధికారంలోకి వస్తే వారిని ఎస్టీ జాబితాలో కలుపుతామన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించి మళ్లీ ఇందిరమ్మ రాజ్యం తేవాలని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని, కానీ ఇందిరమ్మ రాజ్యమంటే ఆకలి బతుకులే అన్నారు. ఇందిరమ్మ రాజ్యాన్ని మనం చూడలేదా? అన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ పార్టీ... రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చేదాక ఆకలి బతుకులే కదా? ఇందిరమ్మ రాజ్యమంతా ఆకలి బతుకులే అన్నారు. అంతకుముందు పేదల బాధలను పట్టించుకున్నది లేదన్నారు. పేదల కడుపును నింపాలని, రైతులకు పొలాలకు నీరివ్వాలనే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి రాలేదన్నారు. తెలంగాణను నాశనం చేశారన్నారు. అలంపూర్ నుంచి పార్టీ అభ్యర్థి వెంకట్రామ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే కరవు అనేది అలంపూర్ రాకుండా చూసే బాధ్యత తనదే అన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులను కాంగ్రెస్ పెండింగులో పెట్టిందన్నారు.





# తెలంగాణను ఎలా ముందుకు నడిపించాలో కాంగ్రెస్‌కు తెలుసు

### రాష్ట్రంలో కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరిట దోపిడీ

### ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ



ఖానాపూర్ (వాయిస్ టుడే): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ అన్నారు. ఇక్కడి ప్రజల ఆకాంక్షల మేరకే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభలో ఆమె మాట్లాడారు. నాందేడ్ నుంచి హెలికాప్టర్‌లో ప్రియాంక అక్కడికి చేరుకున్నారు. ఈ సభలో ఆమె మాట్లాడుతూ భారాస, భాజపాలపై విమర్శలు చేశారు. "జల్, జంగల్, జమీన్ సంస్కృతి ఆదివాసీలది. అది ప్రపంచంలోనే అత్యున్నత సంస్కృతి. ఇందిరాగాంధీ హయాంలో గిరిజనులు, ఆదివాసీల హక్కులకు రక్షణ కల్పించే చట్టాలు చేశారు. అందుకే ఆమె మరణించి 40 ఏళ్లు గడిచినా.. చేసిన మంచి పనులను ఇప్పటికీ తలచుకుంటున్నారు. ఇందిరాగాంధీ స్థానం మీ మనసులో పదిలంగా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. తెలంగాణను ఎలా ముందుకు నడిపించాలో కాంగ్రెస్‌కు తెలుసు. సిద్ధాంతాల ఆధారంగా నడిచే పార్టీ కాంగ్రెస్. ఈ రాష్ట్రంలో 40 లక్షల మంది నిరుద్యోగ యువత ఉన్నారు. వారికి ఉద్యోగాలు రాలేదు కానీ కేసీఆర్ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయి. నియామకాలు చేపడుతున్నామని చెప్పి పరీక్షలు నిర్వహించినా పేపర్ లీక్‌లు జరిగాయి. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే జాబ్ క్యాలెండర్ ప్రకారం నియామకాలు చేపడతామని మాటిస్తున్నాం. ప్రత్యేక రాష్ట్రంలో తమ జీవితాలు మారుతాయని ఉద్యమకారులు కలలు కన్నారు. కానీ అలా జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమకారుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామన్నారు.

రాష్ట్రంలో కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరిట దోపిడీ జరిగింది. ప్రభుత్వ సొమ్ము, ప్రజల సొమ్ము వేర్వేరు కాదు. కేంద్ర ప్రభుత్వం బడా వ్యాపార వేత్తలకు రుణమాఫీ చేసింది. కానీ, రైతులకు రుణమాఫీ చేయడానికి మాత్రం నిధులు లేవని చెబుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ భారాస ప్రభుత్వ అవినీతిపై దృష్టి సారించకుండా కాంగ్రెస్ నేతల ఇళ్లపైకి దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నారు. బీజేపీ, భారాస ఒక్కటి కాబట్టి అలా చేస్తున్నారు. పార్లమెంటులో భారాస ఎంపీలు కేంద్రం ప్రవేశపెట్టిన పలు బిల్లులకు మద్దతుగా ఓటేశారు. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ రాష్ట్రంలో కేసీఆర్‌కు, కేంద్రంలో బీజేపీకి సహకరిస్తున్నారు. ఈ మూడు పార్టీలు ఒక్కటే. మహిళలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. వారి కష్టాన్ని గుర్తించే మ్యానిఫెస్టోలో పలు అంశాలను చేర్చాం. ప్రతి నెలా రూ.2500 వారి ఖాతాలో వేయాలని నిర్ణయించాం. రూ.500లకే గ్యాస్ సిలిండర్, బస్సుల్లో ఉచిత రవాణా, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రూ.15వేల రైతు బంధు, రూ.10లక్షల ఆరోగ్య బీమా, పంటలకు మద్దతు ధర ఇలాంటి పథకాలతో కూడిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రియాంక అన్నారు.

# నిజాంకు పట్టిన గతే కల్వకుంట్ల కుటుంబానికి

### తెలంగాణ ప్రజల ఆకాంక్షలు కోసమే కాంగ్రెస్ మేనిఫెస్టో
### కేసీఆర్ కు ఫెడరల్ స్ఫూర్తి తెలియదు
### ధరణి పేరుతో పెద్ద ఎత్తున భూ దోపిడీ
### టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ ఆధిపత్య ధోరణితోనే ముందుకు వెళ్లారని, పదేళ్లుగా తెలంగాణ ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ, సమానత్వం, సమాన అభివృద్ధి అందలేదని, అందుకే మరోసారి ఉద్యమించాల్సిన పరిస్థితి తెలంగాణలో ఏర్పడిందంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రస్థానాన్ని మూడు భాగాలుగా చూడాల్సి ఉంటుంది. నిజాం నిరంకుశ పాలన, తెలంగాణ ఏర్పడిన తరువాత జరిగిన విధ్వంసం, తెలంగాణలో జరిగిన అన్ని పోరాటాలకు మూలం భూమి. తెలంగాణ చరిత్ర చూస్తే ఆకలినైనా భరించింది కానీ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేదు. అందుకే నాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం జరిగిందన్నారు. నిరంకుశ నిజాంకు పట్టిన గతే కల్వకుంట్ల కుటుంబానికి తెలంగాణ ప్రజలు రుచి చూపించబోతున్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెర వేర్చడానికే కాంగ్రెస్ మేనిఫెస్టోను రూపొందించాం. ప్రజలు ఇచ్చే తీర్పుకు కొలబద్దగా పాలసీ డాక్యుమెంట్‌ను ప్రజల ముందుంచాం. తుది దశ తెలంగాణ ఉద్యమంలో మీడియా ముందుభాగాన నిలవాలి. ప్రజలను బానిసలుగా చూస్తున్న కేసీఆర్‌ను గద్దె దించాలి. తెలంగాణ ప్రజలకు ఇదే చివరి ఉద్యమం కావాలని రేవంత్ అన్నారు.

ఈ ఉద్యమం పరిపాలన కోసం, అధికారం కోసం కాదు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం.. ఈ ఎన్నికల్లో ప్రజలు విస్పష్టమైన తీర్పు ఇవ్వబోతున్నారు. గతంలో కాంగ్రెస్‌లో ఎవరు సీఎంగా ప్రజా దర్బార్‌ను నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఆ ఆదర్శాన్ని తిరిగి పునరుద్ధరిస్తాం. కేసీఆర్ కు ఫెడరల్ స్ఫూర్తి తెలియదు. ఆయన రాచరికం అనుకుంటున్నారని రేవంత్ దుయ్యబట్టారు. రాష్ట్రాల ఆదాయం ఆధారంగా ప్రాధాన్యతలు ఉంటాయి. 2 వేల పెన్షన్ గురించి కేసీఆర్ మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఇచ్చే పెంషాన్ కంటే కర్ణాటకలో పెన్షన్‌తో పాటు మహిళలకు అదనంగా నగదు బదిలీ అవుతోంది. కేసీఆర్ సవాల్‌లో పస లేదు. 60 నెలల్లో కేసీఆర్ పేదలకు 1 లక్షా 80 వేలు బాకీ ఉన్నారు. 110 సీట్లలో డిపాజిట్లు రాని బీజేపీ బీసీ సీఎంను చేస్తామనడం ఓబీసీలను అవమానించడమే. బలహీనవర్గాలు కేసీఆర్‌ను ఓడించాలన్న కసితో ఉన్నారు. ఆ ఓట్లను చీల్చి కేసీఆర్‌కు సహకరించడమే బీజేపీ వ్యూహం. ఏబీసీడీ వర్గీకరణపై గతంలో వెంకయ్య నాయుడు సభ నిర్వహించి 100 రోజుల్లో చేస్తామన్నారు. ఇప్పటికీ అతీగతి లేదు. బిల్లు పెడితే మద్దతు ఇస్తామని కాంగ్రెస్ చెబుతున్నా. బీజేపీ ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదని రేవంత్ మండిపడ్డారు.

దళితుల ఓట్లు కాంగ్రెస్‌కు రాకుండ చీల్చేందుకే కమిటీతో కాలయాపన. మంద కృష్ణకు నేను విజ్ఞప్తి చేస్తున్నా. ఢిల్లీ వెళదాం. మోడీని కలిసి ఆర్డినెన్స్‌కు మద్దతు ఇస్తామని నేను చెబుతా. అఖిల పక్షాన్ని తీసుకుని ఢిల్లీకి వెళ్లి ఆర్డినెన్స్ ఇవ్వాలని మోదీని కోరదాం. ప్రభుత్వం అనుకుంటే 48 గంటల్లో ఆర్డినెన్స్ ఇవ్వొచ్చు. అబద్ధపు హామీలను నమ్మకుండా మందకృష్ణ కార్యాచరణ ప్రకటిస్తే ఆయనకు మద్దతు ఇస్తాం. 24 గంటల కరెంటుపై ఏ సబ్ స్టేషన్ కైనా వెళదాం. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని రేవంత్ తెలిపారు. ధరణి పేరుతో పెద్ద ఎత్తున భూ దోపిడీ జరిగింది. హైదరాబాద్ చుట్టూ ఉన్న లక్ష ఎకరాల నిజాం వారసుల భూములు చేతులు మారాయి. అందుకే ధరణి రద్దు చేస్తామంటే కేసీఆర్ కు దుఃఖం వస్తుంది. కేసీఆర్ సీఎం హోదాలో అబద్దాలు చెప్పి ప్రజల్ని నమ్మించాలని చూస్తున్నారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.



## భక్తులతో కిటకిటలాడిన మల్లన్న క్షేత్రం

చేర్యాల, నవంబర్ 19 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మల్లన్న స్వామి మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో శైవక్షేత్రం పులకరించింది. స్వామి వారి ఉత్సవాలు ముగిసినప్పటికి పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 10వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో అలూరి బాలాజీ తెలిపారు.

శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షణలు, కోడెల స్థంబం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు.

# బీజేపీకి...కుటుంబ పాలనకు మధ్యే ఈ ఎన్నికలు

## బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా



నారాయణపేట : ఈ ఎన్నికలు భాజపాకి, కుటుంబ పార్టీలకు మధ్య జరుగుతున్నాయని బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా వ్యాఖ్యానించారు. ఇతర రాష్ట్రాల్లోలాగానే తెలంగాణలో కూడా బీజేపీ కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతోందని అన్నారు. నారాయణపేటలో నిర్వహించిన బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తుంటే కేసీఆర్ కుటుంబం దుర్వినియోగం చేస్తూ ప్రజలకు చేరనీయడం లేదు. పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్‌ను కేంద్ర ప్రభుత్వం తగ్గిస్తే కేసీఆర్ ఆ ప్రయోజనం ప్రజలకు అందకుండా చేశారు. దేశంలో అత్యధిక ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రం తెలంగాణ. ఓట్ల కోసమే ఇక్కడ ఉర్దూకు ప్రాముఖ్యత ఇస్తున్నారు. భారాస అంటే భ్రష్టాచార్ రాక్షసుల సమితి అనే విషయాన్ని గుర్తించుకోండి. కాళేశ్వరం ప్రాజెక్టు సీఎం కేసీఆర్‌కు ఏటీఎంలా మారింది. రూ.1.20లక్షలతో నిర్మించిన ఆ ప్రాజెక్టులోని ఓ బ్రిడ్జి ఇటీవల కుంగిపోయింది. భాజపా అధికారంలోకి రాగానే కేసీఆర్ అవినీతిపై విచారణ చేపట్టి జైలుకు పంపిస్తామన్నారు.

తెలంగాణ ప్రభుత్వం అవినీతిపరులమయంగా మారింది. మియాపూర్‌లో 4వేల కోట్ల భూ కుంభకోణం జరిగింది. సర్కారు భూములను అమ్మి అవినీతికి పాల్పడ్డారు. దళిత బంధు ఇచ్చి ఎమ్మెల్యేలు ఆ మొత్తంలో 30 శాతం కమీషన్ తీసుకున్నారు. ఈ 30 శాతం కమీషన్ ప్రభుత్వాన్ని ఈ నెల 30న సాగనంపాలి. బీజేపీ ప్రభుత్వాన్ని తీసుకురావాలి. పదేళ్ల కేసీఆర్ పాలనలో డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నిధులు విడుదల చేస్తే ఆ మొత్తాన్ని పేదలకు చేరనీయలేదు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ ఫలాలు ప్రజలకు అందలేదు. వచ్చే ఎన్నికలు తెలంగాణ భవిష్యత్తును నిర్ధారించే ఎన్నికలు. కేంద్రంలో మోదీ చెప్పిన పనులన్నీ చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైంది. అక్కడ ఏ పథకాలూ అమలు కావడం లేదు. అక్కడ ఇచ్చిన ఒక్క గ్యారంటీని అమలు చేయలేదు. ఇక్కడ కూడా 6 గ్యారంటీలు ఇస్తామని ఆ పార్టీ చెబుతోంది. వాటిని నమ్మవద్దని జేపీ నడ్డా చెప్పారు.

# తెలంగాణ ప్రజలతో బీఆర్ఎస్‌ది పేగు బంధం

### హనుమంతుడి గుడి లేని ఊరు లేదు...కేసీఆర్ పథకం అందని ఇళ్లు లేదు: ఎమ్మెల్సీ కవిత
### కాంగ్రెస్‌ది అధికారం కోసం అహంకారం
### కేసీఆర్ మళ్లీ గెలవగానే పెన్షన్లు రూ.5వేలకు పెంచుతాం



ధర్మపురి : ఎన్నికల నేపథ్యంలో ఇతర పార్టీల వారు వచ్చి ఇది చేస్తాం. అది చేస్తామంటూ మాటలు చెప్పి వెళ్తారని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రజలతో బీఆర్ఎస్‌ది పేగు బంధమని, కాంగ్రెస్‌ది అధికారం కోసం అహంకారమన్నారు. కాంగ్రెస్‌కు పెట్టే గుణం లేదని, అధికారకాంక్ష మాత్రమే ఉందన్నారు. పచ్చబడ్డ తెలంగాణ ఆగం కావొద్దంటే ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. కాంగ్రెస్‌కు ఆరు దశాబ్దాలు అవకాశం ఇస్తే ఏం చేశారని నిలదీశారు. అధికారం శాశ్వతం కాదని, అనుబంధం శాశ్వతంగా ఉంటుందన్నారు. తెలంగాణ కోసం బీఆర్ఎస్ తీవ్రంగా ఉద్యమించిందని, రాష్ట్రం కోసం కొట్లాడిన పార్టీ అని, అందుకే ప్రజలతో బీఆర్ఎస్‌కు పేగుబంధం ఉందన్నారు.

గత పదేళ్ల కాలంలో కేసీఆర్ పాలనలో తెలంగాణ పచ్చబడిందన్నారు. కేసీఆర్ చెప్పింది చేసే వ్యక్తి అన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని పనులు కూడా చేశారన్నారు. రాష్ట్రంలో హనుమంతుడి గుడి లేని ఊరు లేదని, అలాగే కేసీఆర్ పథకం అందని ఇళ్లు లేదన్నారు. రాష్ట్రంలో మరోసారి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడగానే పెన్షన్లు రూ.5 వేలకు పెరుగుతుందన్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే రూ.3 వేలకు పెరుగుతుందన్నారు. ఆ తర్వాత ప్రతి సంవత్సరం పెరుగుతూ అయిదేళ్లలో రూ.5 వేలకు చేరుతుందన్నారు. కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పెన్షన్లు ఇవ్వాలని కేసీఆర్ సంకల్పించారన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద పేద మహిళలకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈసారి గెలవగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. అప్పుడు కోటి కార్డులు అవుతాయన్నారు. కేసీఆర్ మేనిఫెస్టో అంటే డబ్బులు ఇచ్చే వాటిని పెంచుడు, సిలిండర్ ధర తగ్గించుడు అన్నారు. ఔర్ ఏక్ బార్ కేసీఆర్ సర్కార్ అని నినదించారు.



## డాక్యుమెంట్లతో రా.. ఆస్తులన్నీ పంచుతా.. గంగులకు బండి ఛాలెంజ్

కరీంనగర్ (వాయిస్ టుడే): మంత్రి గంగుల కమలాకర్‌కి బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఛాలెంజ్ విసిరారు. ఇవాళ కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ.. తన ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లతో గంగుల రావాలని.. అలా చేస్తే తనకున్న ఆస్తులన్నీ ప్రజలకు పంచుతానని తెలిపారు. తనలాగే గంగుల ఆస్తుల్ని పంచే ధైర్యం గంగులకు ఉందా అని సవాల్ విసిరారు. పౌర సరఫరాల శాఖ మంత్రిగా ఉండి ఇప్పటివరకు నియోజకవర్గంలో రేషన్ కార్డులు ఇవ్వని వ్యక్తి మళ్లీ గెలిపిస్తే రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను ప్రజల కోసం కొట్లాడానని, తనపై 74 కేసులు ఉన్నట్లు తెలిపారు. కుటుంబానికి దూరమై ప్రజల కోసం కొట్లాడుతున్నట్లు చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గంగులను చిత్తుగా ఓడిస్తానని స్పష్టం చేశారు. గ్రానైట్ యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



## నిరంకుశ పాలనకు.. ఇందిరమ్మ రాజ్యానికి జరుగుతున్న యుద్ధం: పొంగులేటి

పాలేరు (వాయిస్ టుడే): రానున్న అసెంబ్లీ ఎన్నికలు నిరంకుశ బీఆర్ఎస్ పాలనకు.. ఇందిరమ్మ రాజ్యానికి మధ్య జరుగుతున్న యుద్ధంగా మాజీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. కూసుమంచి మండలం పాలేరులో ఎన్నికల ప్రచారంలో పొంగులేటి మాట్లాడుతూ.. "తెలంగాణ వచ్చాక రాజభోగాలు అనుభవిస్తోంది సీఎం కేసీఆర్ కుటుంబం. ప్రజల సొమ్ము దోచుకోవాలని కేసీఆర్ కోసం తెలంగాణ ఇవ్వలేదు. రానున్న ఎన్నికలు నిరంకుశ పాలనకు, ఇందిరమ్మ రాజ్యానికి మధ్య జరుగుతున్న యుద్ధంలాంటివి. వైఎస్ఆర్టీపీ అధినేత షర్మిల స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకడం శుభపరిణామం. సీపీఐ కూడా 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తోంది. కాళేశ్వరం లాంటి ఇంజినీరింగ్ ఫెయిల్యూర్ ప్రాజెక్టు కట్టి రూ.వేల కోట్లు వృథా చేశారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ ఎంత ధృడంగా ఉన్నాయో చూడండి. అవన్ని మర్చిపోయి.. కాంగ్రెస్ ని విమర్శించే స్థాయి సీఎం కేసీఆర్‌కు లేదు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ కలిసిపోయాయి. లేదంటే కేసీఆర్ ను కేంద్రం ఎందుకు అరెస్ట్ చేయట్లేదు. రూ.లక్ష కోట్ల అవినీతిలో బీజేపీ వాటా ఎంత?" అని ప్రశ్నించారు.

## తండ్రి బీజేపీ.. తనయుడు బీఆర్ఎస్..



సంగారెడ్డి జిలా(వాయిస్ టుడే): ఆందోల్ బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి బాబు మోహన్ కు ఆయన కుమారుడు ఉదయ్ బాబు మోహన్ ఊహించని షాక్ ఇచ్చాడు. ఆదివారం సిద్దిపేటలో మంత్రి హరీశ్ రావు సమక్షంలో ఉదయ్ బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతోపాటు ఆందోల్, జోగిపేట మున్సిపల్ ప్రెసిడెంట్ సాయి కృష్ణ, అందోల్ మండల ప్రెసిడెంట్ నవీన్ ముదిరాజ్, చౌటకుర్ మండల ప్రెసిడెంట్ శేఖర్, ఇతర బీజేపీ నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్ వైపు నిలబడాలని, పార్టీ గెలుపు కోసం అందరం కలిసి కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. కాగా అందోల్ బీజేపీ టికెట్ ఆశించి ఉదయ్ బాబూమోహన్ భంగపడ్డారు. దీంతో ఆయన ఈ మేరకు నిర్ణయం తీసుకుని పార్టీ మారారు.

## విద్యుత్తు ఉత్పత్తి చేతకాక.. ఛత్తీస్‌గఢ్ నుంచి కరెంట్ కొనుగోలు: రేవంత్ రెడ్డి



ఆసిఫాబాద్ (వాయిస్ టుడే): సీఎం కేసీఆర్ కు రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తి చేతకాక కాంగ్రెస్ పాలిత రాష్ట్రం ఛత్తీస్ గఢ్ నుంచి కరెంటు కొనుగోలు చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి విమర్శించారు. ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార యాత్రలో ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని కేసీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేయలేని కేసీఆర్ కాంగ్రెస్ పై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పూర్తిగా తగ్గించి, కాంగ్రెస్ పాలిత రాష్ట్రం నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఆయన మా పార్టీపై అనవసర నిందలు వేయడం మానుకోవాలి. ప్రైవేటు కంపెనీల నుంచి అధిక ధరకు కేసీఆర్ విద్యుత్ కొనుగోలు చేస్తున్నారు. రూ.3 కు వచ్చే యూనిట్ కరెంట్ ని, రూ.14 కు కొనుగోలు చేసి మోసం చేస్తున్నారు. కాంగ్రెస్ వస్తే రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తాం" అని స్పష్టం చేశారు.